
సాక్షి ఒడిశా

శనివారం । 28 । జూన్ । 2025



శుభాకాంక్షలు

ప్రపంచ ప్రఖ్యాత పూరీ జగన్నాథ స్వామివారి రథయాత్ర పురస్కరించుకుని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరి బాబు కంభంపాటి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, విపక్ష నేత నవీన్ పట్నాయక్ తదితర ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ పూరీ సాగర తీరంలో ఆకట్టుకునే సైకత శిల్పం ఆవిష్కరించాడు. ఈ శిల్పంలో 108 బుల్లి జగన్నాథ స్వామి ప్రతిమలను పొందుపరచి ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం విశేషం.



జగన్నాథ స్వామీ.. నయన పథగామి

- పూరీ తీరం.. భక్తజన సంద్రం
- వైభవంగా జగన్నాథ రథయాత్ర
- కనులారా స్వామిని చూసి తరించిన భక్తజనం

దేవదేవుడు గర్భగుడి వదిలి భక్తుల వద్దకు తరలివచ్చాడు. కోవెల పరిసరాలను పావనం చేస్తూ రథాన్ని అధిరోహించాడు. కడలి ఘోషతో పోటీ పడుతూ సాగిన భక్తుల జయ జయ ధ్వానాల నడుమ సుభద్ర, బలభద్ర సమేతుడై గుండిచాకు బయల్దేరాడు. గుండె గొంతుగా చేసుకొని జనం జయహో జగన్నాథ అని కీర్తిస్తుంటే.. చిరు మందహాసుడై ఆలకించాడు. ప్రేమగా రథాన్ని లాగుతుంటే అంతటి గొప్ప దేవుడు అవలీలగా ముందుకు కదిలాడు. నేత్రోత్సవం, నవ యవ్వన సేవతో అలసినా భక్తుల కోసం కొంతదూరం కదిలి, మిగిలిన దూరం మరుసటి రోజు వెళ్దామని సందేశమిచ్చాడు.

\- భువనేశ్వర్





భక్తుల కోసం తరలివచ్చే భగవంతుని దర్శనానికి ఆశేష ప్రజానికం పోటెత్తారు. దీంతో జై జగన్నాథ్ నినాదంతో శ్రీక్షేత్రం మారుమోగింది. భగవంతుని సమక్షంలో హెచ్చు తగ్గులకు తావులేదని రథయాత్ర ప్రత్యక్షంగా ప్రతిబింబిస్తుంది. భక్తికి మించిన శక్తి వేరొకటి లేదని సర్వ జనులు భుజం భుజం కలిపి నింగికి ఎగసే మూడు భారీ రథాలను అవలీలగా గమ్యం చేర్చడం భగవంతునిపై విశ్వాసాన్ని బలపరుస్తుంది. కృత్రిమ మేధస్సుకు ధీటుగా సహజమైన భక్తిభావంతో సాక్షాత్తు జగతి నాథుని రథానికి సాధారణ ప్రజలు యాంత్రిక, సాంకేతిక స్పర్శ లేకుండా నిరాటంకంగా ముందుకు లాగి సురక్షితంగా గమ్యం చేర్చడం అత్యద్భుత ఘట్టంగా అబ్బురపరుస్తుంది. సోదర, సోదరితో కూడి బయల్దేరిన శ్రీజగన్నాథుని రథయాత్రలో తరతరాలుగా సేవలందిస్తున్న వంశీకుల వారసులు, అనంత భక్తజనం ఆద్యంతం ప్రత్యక్ష పాత్రధారులుగా తారసపడతారు. ఇదే తరహాలో ఈ ఏడాది జరిగిన యాత్రలో వంశపారంపర్యంగా స్వామి కార్యంలో పాలుపంచుకుంటున్న వడ్రంగి, కమ్మరి వంటి సేవకులు రథాలను తయారు చేయగా.. దర్జీ, చిత్రకారులు, రూపకారులు ఆకర్షణీయంగా రథాలను తీర్చిదిద్దారు. భక్తజనం గుండిచా మందిరం వైపు యాత్రని సజావుగా నిర్వహించి మనమంతా ఒక్కటే, జగన్నాథుడు మనందరి వాడేనన్న సరళమైన భావనతో యాత్రని మేటిగా నిర్వహించారు.

మార్మోగిన ఘంటానాదం

తరంగ ధ్వనితో మారుమోగిన ఘంటానాదం మధ్య సువిశాల పుష్ప మకుట అలంకరణతో మూల విరాటులు వరుస క్రమంలో తరలి వచ్చి రథాల్లో ఆసీనులయ్యారు. రక్షకుడిగా సుదర్శనుడు ముందుగా బయల్దేరి సుభద్ర దేవి రథంలో ఆసీనుడు అయ్యాడు. దీంతో మార్గం సుగమం ఖరారు సంకేతంగా భావించి బలభద్ర స్వామి బయల్దేరి తాళ ధ్వజంలో చేరాడు. అనంతరం సుభద్ర తన రథంలోకి చేరింది. అన్నా, చెల్లెలు ఉత్సాహంతో రథాల్లోకి చేరడంతో ఉవ్విళ్లూరుతున్న భక్తజనం మధ్యలోకి సుగంధ భరిత శ్రీజగన్నాథుడు నంది ఘోష్ రథం అధిరోహించడంతో యాత్ర ప్రాంగణం హరీ బోల్.. జై జగన్నాథ్ నినాదాలతో శ్రీక్షేత్రం కంపించింది. మూల విరాటులు యాత్ర కోసం రథాల్లో చేరడంతో ఉత్సవమూర్తులు మదన మోహనుడు, రామకృష్ణులు తోడుగా చేరారు. వీరంతా చేరడంతో రథాలు కదిలే దేవాలయాలుగా తేజోవంతం అయ్యాయి. ఆది శంకరాచార్యులు, గోవర్ధన పీఠాధిపతి స్వామి నిశ్చలానంద సరస్వతీ రథాలపై దేవుళ్లకు తొలి దర్శనం చేసుకుని భక్త జనాన్ని ఆశీర్వదించారు. యాత్రకు బయల్దేరే ముందు రథాల్లో దేవుళ్లకు ఎటువంటి అశుచి ఆవహించకుండా తొలి సేవకునిగా పూరీ గజపతి మహారాజా దివ్య సింగ్‌దేవ్ రాజ పురోహితుల ప్రత్యక్ష పర్యవేక్షణలో బంగారు పిడి కలిగిన చీపురుతో మూడు రథాలను ఊడ్చి పవిత్ర జల సించనంతో సుగంధిత పుష్పాలు విరజిమ్మి స్వచ్ఛతని నికరం చేయడంతో రథాల కదలిక కోసం యంత్రాంగం రంగంలోకి దిగింది. రాజావారి సేవ పూర్తి కావడంతో రథాలకు సారథులు, కొయ్య గుర్రాలను అమర్చారు. ఘంటకులు ఇతరేతర వర్గాల వంశపారంపర్య సేవక వర్గం రథాలపైకి చేరి ఘంటానాదం ఆరంభం కావడంతో భక్తజనం ఊపందుకుంది. అన్నా చెల్లెళ్ల రథాల వెంబడి నంది ఘోష్ రథంలో శ్రీజగన్నాథ స్వామి చివరగా బయల్దేరాడు. రథయాత్ర తొలి ఘట్టం ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది. గుండిచా మందిరం అడపా మండపానికి మూల విరాటులు వెళ్లేంత వరకు దైనందిన నిత్య సేవలను రథాలపై యథాతథంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు.

నేడు పునరారంభం

భువనేశ్వర్: యాత్రలో వరుస క్రమంగా బయల్దేరిన మూడు రథాలు సకాలంలో గమ్యం చేరలేక పోయాయి. శ్రీమందిరం, శ్రీగుండిచా మందిరం మధ్యమార్గంలో నిలిచి పోయాయి. ఆచారం ప్రకారం చీకటి పడిన తర్వాత రథాలు లాగడం నిలిపివేయడం అనివార్యమైంది. శుక్రవారం సాయంత్రం 7.41 గంటలతో రథాలు లాగడం నిలిపివేశారు. బాలగండి చౌరస్తాలో బలభద్రుని తాళధ్వజం, మారీచ్‌కోట్ కూడలి ప్రాంతంలో దేవీ సుభద్ర రథం దర్ప దళనం, శ్రీజగన్నాథుని నంది ఘోష్ రథం శ్రీమందిరం సింహద్వారం దగ్గరే నిలిచిపోయింది. అనివార్య కారణాలతో ఈ రథం లాగడంలో తీవ్ర జాప్యం చోటు చేసుకుంది. చీకటి పడడంతో లాంచనంగా లాగి నిలిపివేశారు.

ఉదయం 9.30 గంటలకు...

మార్గమధ్యలో నిలిచిన రథాలను శనివారం ఉదయం 9.30 గంటలకు లాగడం ప్రారంభిస్తారని శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి(సీపీవో) డాక్టర్ అరవింద కుమార్ పాఢి తెలిపారు. అంతవరకు నిత్య, దైనందిన, యాత్ర పూజాదులు రథాలపై యథాతథంగా కొనసాగుతాయి. భక్తులు నిరవధికంగా రథాలపై దేవుళ్లని దర్శించుకునేందుకు వీలవుతుందన్నారు.



మార్గమధ్యలో ఆగిన మూడు రథాలు

స్వామివారి యాత్ర ప్రాంగణంలో అడుగిడిన ప్రతి ఒక్కరిలో భక్తి భావం స్వతహాగా స్ఫురిస్తుంది. రథాలను లాగి దేవుళ్లని గుండిచా మందిరం ప్రాంగణానికి చేర్చేందుకు భక్తి భావమే శక్తిగా ఉపయోగపడుతుంది. యాత్రలో ప్రత్యక్షంగా పాలుపంచుకోవాలనే భక్తులు రథం తాడుని తాకినా స్వామి అనుగ్రహం కటాక్షిస్తుందని గట్టిగా నమ్ముతారు.





రథయాత్రలో ఉత్కళ ప్రసంగ్ ప్రత్యేక సంచికని ఆవిష్కరిస్తున్న గవర్నర్ హరిబాబు కంభంపాటి, సీఎం మోహన్‌చరణ్ మాఝి తదితరులు

స్వామి సేవలో ప్రముఖులు

శ్రీజగన్నాథుని రథయాత్రలో అంతా సమానమే. అతిరథ మహారథులు సాధారణ భక్తజనంతో కలిసిమెలిసి స్వామి రథంలాగి పునీతం కావాలని పరితపిస్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సేవా కార్యక్రమాల్లో అదే తరహాలో పాల్గొని ఉత్సాహపరుస్తారు. ఈ ఏడాది జరిగిన రథయాత్రలో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు దంపతులు, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝితో పాటు పలువురు కేంద్ర, రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేలు తదితర ప్రముఖులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.




సుగంధిత శ్రీమందిరం



శ్రీక్షేత్రంలో రథయాత్ర అత్యంత వైభవోపేత మహోత్సవం. శ్రీమందిరం నుంచి సింహద్వారం గుండా మూల విరాటులు బలభద్రుడు, దేవీ సుభద్ర, శ్రీజగన్నాథుడు యాత్ర కోసం బయటకు తరలి వస్తారు. వీరి రాక పురస్కరించుకుని శ్రీమందిరం సింహద్వారం సుగంధిత పుష్పాలతో ప్రకృతి రమణీయంగా శోభిల్లుతుంది.



జనం వద్దకు తరలి వస్తున్న జగన్నాథస్వామి



శ్రీజగన్నాథుడు అందరివాడు. కుల, మత, వర్గ, వర్ణ విభేదాలకు అతీతంగా సర్వ జనులను కటాక్షించే ప్రత్యక్ష దైవం. యావత్తు భక్తజనం ఏక కాలంలో జై జగన్నాథ్ నినాదంతో ప్రార్థిస్తారనేదానికి ఈ చిత్రం నిలువెత్తు సాక్ష్యం. **– భువనేశ్వర్/పూరీ**

రథ ప్రతిష్ఠ



రథయాత్రలో రథ ప్రతిష్ఠ దేవతల యాత్రకు రథాలు సిద్ధం సంకేతాన్ని ఇస్తాయి. దీనిలో భాగంగా రథ శిఖరంపై కలశ పూజ నిర్వహిస్తారు. అంతకు ముందు సేవకులు పవిత్ర జలాన్ని చల్లి సంప్రదాయబద్ధమైన ఇతర పవిత్ర ఆచారాలను నిర్వహిస్తారు. శ్రీమందిరం లోపల సూర్యపూజ తర్వాత, ద్వారపాల పూజ, గోపాల వల్లభ ప్రాతః ధూప ఆచారాలు పూర్తి కావడంతో వెలుపల రథ ప్రతిష్ఠ నిర్వహించారు.

జగన్నాథునికి బాహు కవచం



రథయాత్ర పాహండిలో రక్షా కవచంతో తరలి వస్తున్న దేవీ సుభద్ర

భువనేశ్వర్: అస్వస్థత నుంచి కోలుకున్న వెంటనే జగతి నాథుడు భక్తజనం మధ్యకు తరలి వచ్చాడు. స్వీయ రక్షణ కోసం అత్యంత జాగ్రత్తతో బయటకు అడుగు పెట్టడం విశేషం. యాత్రలో భాగంగా పలు మార్లు ఎత్తుడు, దింపుడు మధ్య మూల విరాటులు నలిగి పోతాయి. ఈ సన్నాహంలో శరీరానికి ఎటువంటి హాని కలగకుండా ప్రత్యేక రక్షా కవచ ధారణతో బయల్దేరుతాడు. ఈ సందర్భంగా చేపట్టే చర్యని బాహు కవచం అమరిక (బాహుటొ కొంటొకొ)గా వ్యవహరిస్తారు. దైతపతి సేవకులు ఎంతో బాధ్యతతో మూల విరాటులకు బాహు కవచాల్ని అమర్చుతారు. ఈ పని పూర్తయినట్లు ధ్రువీకరించిన తర్వాత మూల విరాటులను కదిపేందుకు పూనుకుంటారు. ఈ సన్నాహంతో శ్రీ భుజాలు దృఢంగా తయారవుతాయి.

ఎత్తుడు, దింపుడులో (పాహండి) ఎటువంటి హాని సంభవించేందుకు అవకాశం ఉండదు. స్నాన పూర్ణిమకు ముందుగానే వీటిని సిద్ధం చేస్తారు. జ్యేష్ఠ శుక్ల పక్ష త్రయోదశి నాటికి స్నానయాత్ర, రథ యాత్ర మరియు మారు రథయాత్ర కోసం అవసరమైన బాహు కవచాలను సిద్ధం చేస్తారు. ఈ మూడు సందర్భాల్లో మూల విరాటులు రక్షా కవచంతో బయటకు వస్తాయి. స్వామి సేవలో సామగ్రి పునర్వినియోగం ఉండదు. ఏటా సాక్షి గోపాల్ వకుల వనం నుంచి తరలించే బొగొడ చెట్టు చెక్కతో మూల విరాటుల రక్షా కవచం తయారు చేయడం ఆనవాయితీగా కొనసాగుతుంది.

చరిత్రను పరిశీలిస్తే..

దీని వెనుక ఒక కథనం ప్రచారంలో ఉంది. సాక్షి గోపాలు వకుల వనంలో ఒక సన్యాసి తపస్సులో నిమగ్నమై ఉన్న తరుణంలో పరీక్షించేందుకు సోదరులు శ్రీ జగన్నాథుడు, బలభద్ర స్వామి సాధారణ వ్యక్తుల రూపంలో వనంలోనికి చొరబడి అక్కడ చెట్టులో పండిన పనస పండుకోసే మెషిన్‌తో అలికిడి చేస్తారు. ఆ శబ్దానికి తపో దీక్షలో ఉన్న సన్యాసి ఉలికిపడి ఇరువురినీ నిలదీస్తాడు. వీరిరువురు వాస్తవ వివరణ తెలియజేయకపోవడంతో తెల్లారే వరకు వనంలో బొగొడ చెట్టుకు కట్టి పడేసి ఉదయం రాజావారు ముందు ప్రవేశ పెడతానని బెదిరించడంతో దేవుళ్లు ప్రత్యక్షం అవుతారు. ఈ వాస్తవం బాహ్య ప్రపంచానికి తెలియకుంటే పనస పండు దొంగతనం నింద తనకు చుట్టుకుంటుందని సన్యాసి ప్రాధేయపడతాడు. సన్యాసి అభీష్టం మేరకు జగతికి తెలియజేసేందుకు ఏటా 3 సార్లు వకుల వనంలో బొగొడ చెట్టు కలపతో రక్ష కవచం ధారణ చేసి యావతు భక్త జనం మధ్య ప్రత్యక్షం అవుతామని వరం ఇచ్చి అదృశ్యమవుతారు. మానవ రూపంలో దేవుళ్లను ఏ చెట్టుకు కట్టి పడేస్తామని సన్యాసి బెదిరించాడో, అదే చెట్టు కలపని ఏటా 3 సార్లు మూల విరాటులు కట్టుకుని బాహ్య ప్రపంచంలో ప్రత్యక్షం కావడంతో భగవంతుడు, భక్తుని మధ్య భక్తిభావ సంబంధానికి ప్రతీకగా కొనసాగుతుందని చెబుతారు.



రక్షా కవచంలో శ్రీజగన్నాథ స్వామి (నమూనా)

క్లుప్తంగా

చోరీ కేసులో నిందితులు అరెస్టు



స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తుతో నిందితులు

రాయగడ: ఒక చోరీ కేసుకు సంబంధించి జిల్లాలోని అంబొాదల పోలీసులు 11 మంది నిందితులను అరెస్టు చేశారు. అంబొాదల పోలీస్‌స్టేషన్ పరిధి జగదల్‌పూర్ ప్రాంతంలోని ఒక క్రషర్‌లో ఇటీవల చోరీ జరిగింది. ఈ చోరీ కేసులో నిందితులను పట్టుకున్న పోలీసులు వారి నుంచి నాలుగు ఇనుప పైపులు, గ్యాస్ కట్టర్లు, మూడు ఆక్సిజన్ సిలెండర్లు తదితర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులను గురువారం కోర్టుకు తరలించారు.

ఎడతెరిపి లేని వర్షం

● కొట్టుకుపోయిన రోడ్డు



చిపాకూర్ పంచాయతీలో కొట్టుకపోయిన రోడ్డు

జయపురం: కొరాపుట్ జిల్లాలో కొద్ది రోజులుగా ఎడతేరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుగడ సమితి చిపాకూర్ పంచాయతీ ప్రధాన మార్గంలోని కిర్మాల గ్రామ సమీపంలో నిర్మించిన కల్వర్టు, రోడ్డు కొట్టుకుపోయాయి. 6 నెలల క్రితం నిర్మించిన కల్వర్టు కూలిపోగా, తారు రోడ్డు కొట్టుకుపోయింది. వీటిపై ఆధారపడి సుమారు 6 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే కల్వర్టు కూలిపోవడంతో ప్రస్తుతం ఆయా గ్రామాలకు సమితి కేంద్రాలతో సంబంధాలు దెబ్బతిన్నాయి. కాగా నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వలనే కొట్టుకుపోయినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. రూరల్ డవలప్‌మెంట్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని రోడ్డు పునరుద్ధరించాలని కోరుతున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న ట్యాంకర్

రాయగడ: స్థానిక కపిలాస్ కూడలి వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి దిగుతున్న ట్యాంకర్ అదుపుతప్పి ఎదురుగా ఉన్న డివైడర్‌ను ఢీకొంది. శుక్రవారం వేకువజామున ఈ ఘటన చోటుచేసుకుంది. విశాఖపట్నం నుంచి బ్యాక్ ఆయల్ లోడ్‌తో జాజ్‌పూర్ వైపు వెళ్తున్న ట్యాంకర్ స్థానిక కపిలాస్ కూడలి వద్ద ఫ్లైఓవర్ దిగుతున్న సమయంలో ఎదురుగా వస్తున్న ఒక ఆటోని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ట్యాంకర్ డ్రైవర్ సంతోష్ కుమార్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సమాచారం తెలుసుకున్న సదరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

సీఎం మోహన్ చరణ్ రాజీనామా చేయాలి

జయపురం: రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని, అల్పవర్గాల ప్రజలు, దళితులపై దాడులు రోజురోజుకూ పెరుగుతున్నాయని భారతీయ కమ్యూనిస్టు పార్టీ కొరాపుట్ జిల్లా శాఖ ఆరోపించింది. అత్యాచారాలు అరికట్టలేని సీఎం మోహన్‌చరణ్ మాఝీ రాజీనామా చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జయంతి దాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జయపురం ప్రధాన కూడలి వద్ద నిరసన చేపట్టారు. ఆందోళనలో రాష్ట్ర సీపీఐ కార్యవర్గ సభ్యుడు, కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి, సీపీఐ జిల్లా కార్యదర్శి జుధిష్ఠర రాలో, సహాయ కార్యదర్శి కుమార్ జాని, జిల్లా మాజీ సహాయ కార్యదర్శి రామకృష్ణ దాస్, సత్యబ్రత నందో, నంద హరిజన్, బలభద్ర బోయి, పవన మహులియ, ఘాశీరాం సాహు తదితరులు పాల్గొన్నారు.

అపురూప అవకాశం

● గవర్నర్ హరిబాబు కంభంపాటి

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ స్వామి వార్షిక రథయాత్రలో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి దంపతులు పాల్గొన్నారు. ఇదో అపురూప అవకాశమని పేర్కొన్నారు. బొడొదండొలో జై జగన్నాథ నినాదాల మధ్య రథాలు కదులుతున్న దృశ్యం ప్రజల భక్తిశ్రద్ధల అపూర్వ సంగమంగా హృదయాన్ని హత్తుకుందన్నారు. దైవ చింతనలో ఐక్యత మరియు విశ్వాసం మమేకం కావడం శ్రీజగన్నాథుని లీలగా తన్మయత్వం వ్యక్తం చేశారు. శ్రీజగన్నాథుని రథయాత్ర ఆనందకరమైన భక్తి వాతావరణ ఆవిష్కరణకు నాందిగా పేర్కొన్నారు.

సుదర్శనుని పాహండి

భువనేశ్వర్: యాత్రలో రక్షకునిగా సుదర్శనుని స్థానం అత్యంత కీలకం. మూల విరాటుల కంటే ముందుగా సుదర్శనుడు శ్రీమందిరం నుంచి బయటకు తరలివచ్చి రథంపై ఆసీనుడు అయ్యాడు. ఆయన చతుర్ధామూర్తిగా మూల విరాటుల సరసన నిత్యం దర్శనం ఇస్తాడు. సుభద్ర దేవి రథంలో రక్షకునిగా యాత్ర కొనసాగిస్తాడు.



పర్లాకిమిడి: చెరా పహారా కార్యక్రమంలో పాల్గొన్న గజపతి వంశీయురాలు కల్యాణీ దేవి గజపతి



మల్కన్‌గిరి: రథంపై దేవతామూర్తులకు పూజలు చేస్తున్న కలెక్టర్ ఆశిష్ పటేల్



కొరాపుట్: రథయాత్ర విగ్రహాలు తెస్తున్న కమాండెంట్ ఎన్‌కేకే ప్రసాద్



మల్కన్‌గిరి: రథం ఎదుట నృత్యాలు చేస్తున్న కళాకారులు

సర్వం జగన్నాథం

● రాష్ట్రవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో రథయాత్ర

పర్లాకిమిడి:

గజపతి జిల్లా పర్లాకిమిడిలో రథయాత్ర సందర్భంగా ఘోష యాత్ర మధ్యాహ్నం 3 గంటల తర్వాత ప్రారంభమైంది. ఉదయం జిల్లా కలెక్టర్ బిజయ కుమార్‌దాస్, ఎస్పీ జ్యోతింద్ర నాథ్ పండా, సబ్ కలెక్టర్ అనుప్ పండాలు విచ్చేసి జగన్నాథ, బలభద్ర, సుభద్ర రథయాత్రకు పహాండిని ప్రారంభించారు. మధ్యాహ్నం 2 గంటలకు పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి విచ్చేసి జగన్నాథ, బలభద్ర, సుభద్రలను రథాలపైకి తీసుకెళ్లారు. అనంతరం గజపతి వంశీయురాలు కల్యాణీ దేవి గజపతి మేళతాళాలతో రాజ మందిరం నుంచి విచ్చేసి జగన్నాథుని రథంపై శాస్త్రోక్తరంగా పూజలు చేసి బంగారు చీపురుతో ఊడ్చి శుభ్రం చేశారు. దీనిని చెరాపహారా అంటారు. స్థానిక కళాకారులు రథాల ముందు ఒడిస్సీ నృత్యాలతో ప్రజలను అలరించారు. మూడు రథాలను గుండిచా మందిరం వైపు సాయంత్రం 5.00 గంటలకు తీసుకెళ్లడం మొదలుపెట్టారు. పోలీసులు కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు చేయడం వలన ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు.





పర్లాకిమిడి: రథయాత్ర వీక్షించడానికి విచ్చేసిన అశేష జనవాహిని (ఇన్‌సెట్లో) శ్రీజగన్నాథుడిని రథంపైకి ఎక్కిస్తున్న దృశ్యం



కొరాపుట్: జయపూర్ రాజకోట వద్ద రథయాత్ర దృశ్యం

మల్కన్‌గిరిలో...

జిల్లా కేంద్రంలో జగన్నాథ స్వామివారి రథయాత్ర ఘనంగా ప్రారంభమైంది. ముందుగా కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్‌తో ఆలయ అర్చకులు పూజ నిర్వహించి రథం లాగడం ప్రారంభించారు. యాత్రలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. రథం కదిలే సమయంలో కళాకారులు నృత్య ప్రదర్శనలు చేశారు. స్వామివారి దర్శనం కోసం అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు.

రాయగడలో...

రాయగడలో రథయాత్ర వైభవంగా జరిగింది. జగన్నాథ మందిరం నుంచి దేవతామూర్తులకు సాంప్రదాయబద్ధంగా పాహండి నిర్వహించి ప్రత్యేకంగా రూపొందించిన రథంలో నిలిపారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు రథంలాగే కార్యక్రమాన్ని చేపట్టారు. కలెక్టర్ ఫరూల్ పట్వారీ, తహసీల్దార్ ప్రియదర్శిని స్వయి, కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక, రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక తదితరులు రథంలాగే కార్యక్రమంలో పాల్గొన్నారు. అడుగడుగునా భక్తుల సౌకర్యార్థం స్వచ్ఛంద సేవా సంస్థలు మజ్జిగ, చల్లని పానీయాలు వితరణ చేశారు. ఇదిలా ఉండగా స్థానిక రైతుల కాలనీలోని జిమ్స్ పాఠశాల విద్యార్థులు రూపొందించిన రథం అందరినీ ఆకట్టుకుంది. రథయాత్రను తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు స్థానిక మజ్జిగౌరి మందిరం ట్రస్టు తరుపున మందిరం ప్రాంగణంలో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



కొరాపుట్: జయపూర్‌లో రథం మీద దేవదేవుడు



మల్కన్‌గిరి: రథంపై యాత్రకు బయల్దేరిన జగన్నాథ, సుభద్ర, బలభద్రులు



జయపురం: పూర్ణఘడ్‌లో రథంపై పూజలు చేస్తున్న సేవకులు



జయపురం: జగన్నాథుడిని రథం వద్దకు తోడ్కొని వస్తున్న సేవాయతులు



రాయగడ: రథంపై కొలువుదీరిన దేవతామూర్తులు



రాయగడ: భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

జయపురంలో...

పట్టణంలో అంగరంగ వైభవంగా రథయాత్ర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని మిగిలిన ప్రాంతాల్లో శుక్రవారం యాత్ర జరగగా, ఒక్కరోజు తర్వాత అనగా శనివారం నుంచి జయపురంలో రథయాత్ర జరుగుతుంది. దీనిలో భాగంగా శుక్రవారం జగన్నాథ స్వామి ఆలయం నుంచి దేవతామూర్తులను మంగళ వాయిద్యాలతో తోడ్కొని వచ్చి రథాలపై ఆశీనులు చేశారు. అనంతరం శనివారం మధ్యాహ్నం వరకు దేవతామూర్తులకు భక్తులు పూజలు చేస్తారు. శనివారం మధ్యాహ్నం 4 గంటలకు రథాన్ని గుండిచా మందిరానికి తీసుకొని వెళ్తారు.

కొరాపుట్‌లో...

కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో రథయత్ర తొలి ఘట్టంలో భాగంగా రథాలు గుండిచా మందిరాలకు చేరుకున్నాయి. కొరాపుట్ జిల్లా కేంద్రంలో జయపూర్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి దంపతులు, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్ఛోలు పాల్గొన్నారు. నబరంగ్‌పూర్‌లో స్థానిక బీజేపీ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి రథం లాగారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో సీఆర్‌పీఎఫ్ 12వ బెటాలియన్‌లో నేతృత్వంలో కమాండెంట్ ఎన్‌కేకే ప్రసాద్ నేతృత్వంలో రథయాత్ర జరిగింది. మరోవైపు విశ్వవ్యాప్త రథయాత్రకు విభిన్నంగా జయపూర్, ఆంధ్రా–ఒడిశా వివాదస్పద ప్రాంతం కొఠియాలో ఒక రోజు ఆలస్యంగా శనివారం రథయాత్ర జరగనుంది. శుక్రవారం మాత్రం పాహండి నిర్వహించి విగ్రహాలను రథం మీదకి చేర్చారు.



రాయగడ: చిన్నారుల రథం సందడి



కొరాపుట్: రథం లాగుతున్న మీనాక్షి బాహిణీపతి తదితరులు



రాయగడ: రథం లాగుతున్న కలెక్టర్ పట్వారీ, ఎంపీ సప్తగిరి, ఎమ్మెల్యే కద్రక తదితరులు



సత్వర స్పందన

రథాలు లాగేందుకు తరలివచ్చిన అశేష భక్తజనం మధ్య తోపులాట వంటి పరిస్థితుల్లో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా స్వచ్ఛంద సేవకులు సత్వర సేవలు అందించారు. ఇబ్బందికర, ఆకస్మిక అస్వస్థత ఇతరేతర బాధితులకు తక్షణ సేవలు అందజేసి ఆదుకున్నారు.

–భువనేశ్వర్



వాడవాడలా రథయాత్ర

శ్రీజగన్నాథుని రథయాత్ర విశ్వ విఖ్యాతం. వాడవాడలా ఆబాలగోపాలం స్వామి రథయాత్రని అత్యంత ఆనందోత్సాహాలతో నిర్వహించారు. ఖుర్దారోడ్ బలిఛక్ సాహి వీధిలో చిన్నారులు బుల్లి రథంలో చిన్ని జగన్నాథుని కొలువుదీరించి యాత్ర నిర్వహించారు. చిన్నారుల భక్తిభావం పెద్దల మన్ననలు సొంతం చేసుకుంది.

–భువనేశ్వర్



భక్తులకు ఉపశమనం

నీటి బిందువు జారని జన సందోహం మధ్య ఉక్కిరిబిక్కిరి పరిస్థితి నివారించేందుకు చన్నీటి సించనం రథయాత్రలో ప్రాణాధార తుల్యం. అగ్నిమాపక సేవ ఈ ఏర్పాటు చేసింది. శ్రీమందిరం నుంచి గుండిచా మందిరం వరకు దారి పొడవునా ఈ సౌకర్యం కల్పించి భక్తులకు ఉపశమనం కలిగించింది.

–భువనేశ్వర్



ఆకట్టుకునే పుష్ప మకుటం

స్వామివారి అలంకరణలో ఆకట్టుకునే అపురూప పుష్ప మకుటం. దీనిని యాత్ర వ్యవహారిక భాషలో ఠయ్యా అంటారు. సుగంధిత పుష్పాలతో దేవతా త్రయం బలభద్రుడు, దేవీ సుభద్ర, శ్రీజగన్నాథుని కోసం వేర్వేరుగా 3 ఠయ్యాలు తయారు చేస్తారు. స్థానిక రాఘవ దాసు మఠం క్రమం తప్పకుండా వీటిని పంపిణీ చేస్తుంది. వీటి తయారీలో వెదురు బద్దలు, జీలుగు, జరీ కాగితాలు వంటి ఆకర్షణీయమైన వస్తువులతో పాటు సుగంధిత పుష్పాలను వినియోగిస్తారు. కదంబ పుష్పాలు ప్రముఖ స్థానం ఆక్రమించి ఆబాలగోపాల భక్తజనాన్ని ఆకట్టుకుంటాయి.

–భువనేశ్వర్

జగన్నాథుని పెయింటిగ్ వర్క్‌షాపు

జయపురం: స్థానిక విక్రమ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ కళాశాలలో రథయాత్ర పురస్కరించుకొని శ్రీజగన్నాథ స్వామివారి చిత్రకళా పెయింటింగ్ శిబిరం గురువా రం ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఝుష్టర్ మల్లిక్ అధ్యక్షతన చేపట్టిన వర్క్‌షాపును రచయిత, ఆదివాసీ జీవన పరిశోధకుడు డాక్టర్ పరేష్ రథ్ ప్రారంభించారు. దీనిలో భాగంగా అనేక చిత్ర రూ పాలను విద్యార్థులు గీశారు. ఈ చిత్రాలను శనివా రం విక్రమ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ కళాశాలలో ప్రదర్శించనున్నట్లు ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్న కళాశాల అధికారులు తెలియజేశారు. ఈ ప్రదర్శన ఈనెల 29వ తేదీ సాయంత్రం 5గంటల వరకు ఉంటుందని తెలిపారు.





వివిధ రూపాల్లో శ్రీజగన్నాథుడి రూపాలను గీస్తున్న విద్యార్థులు

సజావుగానే రథయాత్ర

● రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్

భువనేశ్వర్: రథయాత్రలో అసంతృప్తికర సంఘటన చోటు చేసుకుంది. అన్నా, చెల్లెళ్ల రథాలు తాళధ్వజం, దర్ప దళనం సకాలంలో కదిలి మెల్లగా ముందుకు సాగాయి. కానీ శ్రీజగన్నాథుని నందిఘోష్ రథం మాత్రం కదల్లేదు. ముందు బయల్దేరిన బలభద్రుని రథం తాళ ధ్వజం ముందుకు కదలడంలో అవాంతరాలు ఎదురు కావడంతో వెంబడి బయల్దేరాల్సిన నందిఘోష్ రథం కదపడం సాధ్యం కాలేదు. ఇదో అనివార్య ఘటనగా రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ సర్ది చెప్పారు. యాత్ర కార్యక్రమాలన్నీ సకాలంలో సజావుగానే సాగాయన్నారు. నిర్ధారిత వేళ ప్రకారం సాయంత్రం 4 గంటల నుంచి రథాలు లాగడం ఆరంభం అయిందని పేర్కొన్నారు. వాతావరణం అనుకూలించడంతో గతం కంటే ఈ ఏడాది సుమారు ఒకటిన్నర రెట్లు అధికంగా యాత్రికులు, భక్తులు తరలివచ్చారని వెల్లడించారు. ఇటువంటి పరిస్థితుల్లో రథాల కదలికలో కొంతమేరకు అవాంతరాలు ఎదురైనట్లు మంత్రి వివరించారు. చీకటిపడిన తర్వాత రథాలు లాగడంపై తలెత్తిన విమర్శలపై మంత్రి స్పందించారు. యాత్ర రోజున రథం లాగాల్సి ఉన్న నియమం మేరకు జగన్నాథుని నంది ఘోష్ రథం లాంఛనంగా కదిపినట్లు పేర్కొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

● ముగ్గురు యువకులు మృతి

కొరాపుట్: ఒక కుటుంబానికి చెందిన చేతికందివచ్చిన యువకులు ఒకేసారి మృత్యువాత పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం వేకువజామున నబరంగ్‌పూర్ జిల్లా జొరిగాం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో జొరిగాంకు చెందిన చంపక్ లాల్ జైన్ కుమారుడు సాగర్ జైన్ (21), మహవీర్ జైన్ కుమారుడు అంకుర్ జైన్ (22), మన్మోహన్ జైన్ కుమారుడు క్రిష్ జైన్ (18)లు మృతి చెందారు. వీరంతా కారులో పుప్పుగాం రోడ్డులో వెళ్తుండగా దినేగుడ గ్రామం వద్ద బురద వలన వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ప్రమాదం జరిగిన వెంటనే సాగర్ జైన్, అంకుర్ జైన్‌లు అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన క్రిష్ జైన్‌ని పోలీసులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. మృతులు తండ్రులు ఇద్దరు అన్నదమ్ములు కాగా, మరో వ్యక్తి ఇదే కుటుంబానికి చెందిన వ్యక్తి. ముగ్గురు యువకులు వారి తల్లిదండ్రులకు ఒకే ఒక్క కుమారులు కావడం విచారకరం.



సాగర్ జైన్ (ఫైల్)



అంకుర్ జైన్(ఫైల్)



క్రిష్ జైన్(ఫైల్)

క్లుప్తంగా

పైడితల్లికి స్వర్ణపుష్పార్చన



స్వర్ణ పుష్పాలతో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్‌: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, సిరుల తల్లి శ్రీ పైడితల్లి అమ్మవారికి ఆలయంలో శుక్రవారం స్వర్ణ పుష్పార్చన చేశారు. వేదమంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, వేదపండితులు సాయికిరణ్‌, అమ్మవారికి దూసి శివప్రసాద్‌ శర్మ సహస్రనామ ప్రత్యేక స్వర్ణ పుష్పార్చన సేవను నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఇన్‌చార్జ్‌ ఈఓ కె.శిరీష కార్యక్రమాలను పర్యవేక్షించారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం



భోజనం హోటల్‌లోకి దూసుకుపోయిన కారు

బాడంగి: ఓ కారు అదుపుతప్పి భోజనం హోటల్‌లోకి దూసుకు పోయిన సంఘటనలో అదృష్టవశాత్తు పెనుప్రమాదం తప్పింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. బొబ్బిలి నుంచి జయపూర్‌ వెళ్తున్న కారు స్పీడ్‌ బ్రేకర్‌ మూలంగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ముందుటైర్లు రాయిపైకి ఎక్కి పోవడంతో స్టీరింగ్‌ అదుపుతప్పింది. దీంతో మండలకేంద్రంలో పోలీస్‌స్టేషన్‌ ఎదురుగా గల ఎం.చైతన్య భోజనం హోటల్‌లోకి కారు ఒక్కసారిగా దూసుకుపోయింది. అయితే ఆ హోటల్‌లో టిఫిన్‌ సెక్షన్‌ లేకపోవడంతో పాటు ఉదయం 8గంటల సమయం కావడంతో పనివారు హోటల్‌ లోపల ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బయట ఎవరూ లేకపోవడంతో ప్రాణహాని తప్పిందని హోటల్‌ సిబ్బంది భయాందోళనతో చెప్పారు.

మహిళపై కత్తిపీటతో దాడి

వేపాడ: మండలంలోని నల్లబిల్లి గ్రామానికి చెందిన మహిళపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి కత్తి పీటతో దాడి చేసినట్టు వల్లంపూడి పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం గ్రామానికి చెందిన ఉడతా మణికంఠ గ్రామంలోని తల్లి సీతారాం (62)ఇంటికి వెళ్లి పరామర్శిస్తు ఉడతా మణికంఠ ఆమె చిన్నికి ఇవ్వడానికి ఆమె గదిలోకి వెళ్లగా మెడ లోని బంగారం తాడు తుంచి వేయడానికి మణికంఠ ప్రయత్నం చేశాడు. దీంతో సీతారాం కేకలు వేయగా పరిసరాల్లో ఉన్న వ్యక్తులు పరిగెత్తికి ఇంట్లో ఉన్న కత్తిపీటతో సీతారాం మెడపై మణికంఠ దాడి చేసి గాయ పర్చాడు. స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇచ్చి కొటపాడు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవలకు విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. సమాచారం మేరకు ఎస్‌.కోట రూరల్‌ ఎస్సై ఎల్‌.అప్పలనాయుడు గ్రామానికి వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలి కుమారుడు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు ఎస్సై తెలిపారు.

ఖతర్‌లో వెల్డర్స్‌ ఉద్యోగాలు

పార్వతీపురం టౌన్‌: ఖతర్‌ దేశంలో వెల్డర్స్‌ ఉద్యోగాల నియామకం కోసం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భారీగా ఉద్యోగ నియామక డ్రైవ్‌ చేపట్టనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయి కృష్ణ చైతన్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థుల వయస్సు 24 నుంచి 45 సంవత్సరాలలోపు ఉండాలని, ఐటీఐ లేదా ఐటీసీ విద్యార్హత ఉండి నాలుగు సంవత్సరాల అనుభవం ఉండాలని పేర్కొన్నారు. టీఐజీ లేదా ఏఆర్సీ మల్టీవెల్డర్‌ ఉద్యోగానికి ఎంపికైన వారికి రూ.52 వేల నుంచి రూ.61,500, టీఐజీ లేదా ఏఆర్సీ వెల్డర్‌ ఉద్యోగానికి రూ.42,500 నుంచి రూ.52వేల వరకు వేతనం ఇస్తారని స్పష్టం చేశారు. కాంట్రాక్ట్‌ కాలం రెండేళ్లు ఉంటుందని, ఉచిత వసతి, భోజన, వైద్య సదుపాయం, రవాణా సౌకర్యం, స్వదేశానికి ఒక్కసారి వచ్చి పోవడానికి టికెట్‌ సౌకర్యం ఉంటుందన్నారు. పాస్‌పోర్టు, అనుభవం, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు అభ్యర్థులకు కలిగి ఉండాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ బయోడేటాను rkiinter national@aprrdc.inకు పంపాలని, మరిన్ని వివరాల కోసం ఫోన్‌ 9988853335, 8712655686 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జిందాల్‌ రైతులకు వారంలో పరిహారం

● సమీక్షించిన కలెక్టర్‌ అంబేడ్కర్‌



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌ డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌

విజయనగరం అర్బన్‌: జిందాల్‌ భూముకు సంబంధించి రైతులకు ప్రభుత్వం చెల్లించాల్సిన పరిహారాన్ని వారంరోజుల్లో అందజేయాలని కలెక్టర్‌ డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ ఆదేశించారు. జిందాల్‌ కోసం సేకరించిన భూములపై తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్‌ శుక్రవారం సమీక్షించారు. ఇప్పటివరకు చెల్లించిన పరిహారం, పెండింగ్‌ బకాయిలపై ఆరా తీశారు. సుమారు 28 ఎకరాలకు సంబంధించి 15 మంది రైతులకు మాత్రమే పరిహారం పెండింగ్‌ ఉందని, వారికి వెంటనే పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు జిందాల్‌ చెల్లించాల్సిన పరిహారంపైనా చర్చించారు. పదిరోజుల్లో పెండింగ్‌ బకాయిలను రైతులకు చెల్లించాలని జిందాల్‌ యాజమాన్యాన్ని కలెక్టర్‌ ఆదేశించారు.

జిందాల్‌ భూముల్లో ఎంఎస్‌ఎంఈ పార్కు

జిందాల్‌ భూముల్లో ఎంఎస్‌ఎంఈ పార్కును ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్‌ చెప్పారు. ఈ మేరకు నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టర్‌ మాట్లాడుతూ జిందాల్‌ భూములకు సంబంధించి కేవలం 15 మంది రైతులకు మాత్రమే బకాయి ఉందని చెప్పారు. జిందాల్‌ పరిశ్రమకు అప్పట్లో సుమారు 1,166 ఎకరాలను ప్రభుత్వం అప్పగించిందన్నారు. ఈ భూముల్లో 180 ఎకరాలను జిందాల్‌ యాజమాన్యమే నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేసిందని చెప్పారు. ఇది కాకుండా మొత్తం 375 మంది రైతుల నుంచి 834 ఎకరాల అసైన్డ్‌ భూమిని, 151 ఎకరాల ప్రభుత్వ భూమిని జిందాల్‌కు కేటాయించినట్లు తెలిపారు. జిందాల్‌ కోసం ఒక్క ఎకరం భూమిని కూడా రైతుల దగ్గర సేకరించలేదని, 2013 భూసేకరణ చట్టం ఇక్కడ వర్తించదని కలెక్టర్‌ స్పష్టం చేశారు. మొత్తం 28.72 ఎకరాలకు సంబంధించి 15 మంది రైతులకు ఉన్న బకాయిని వారం రోజుల్లో చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 1962లో మొత్తం 20 మందికి పట్టాలు ఇవ్వగా వారిలో నలుగురు మాత్రమే ఇళ్లు కట్టుకోగా, వారికి అప్పట్లోనే పరిహారం చెల్లించినట్లు తెలిపారు. షెడ్లు, ఉద్యోగ కల్పన, పరిశ్రమ సెటిల్‌మెంట్‌కు సంబంధించి జిందాల్‌ యాజమాన్యమే రైతులతో నేరుగా ఒప్పందం కుదుర్చుకుందని దానిలో ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని కలెక్టర్‌ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్‌కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, డీసీఎంఎస్‌ చైర్మన్‌ గొంప కృష్ణ, జాయింట్‌ కలెక్టర్‌ ఎస్‌.సేతుమాధవన్‌, ఎస్‌కోట తహసీల్దార్‌ డి.శ్రీనివాసరావు, కలెక్టరేట్‌ డి సెక్షన్‌ సూపరింటెండెంట్‌ తాడ్డి గోవింద, ఇతర అధికారులు, జిందాల్‌ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సికిల్‌ సెల్‌ వ్యాధిని పూర్తిగా అరికట్టాలి

● కలెక్టర్‌ బీఆర్‌. అంబేడ్కర్‌



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌

విజయనగరం ఫోర్ట్‌: సికిల్‌సెల్‌ వ్యాధిని పూర్తిగా అరికట్టాలని కలెక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం ఆయన వైద్యారోగ్యశాఖ, గిరిజన సంక్షేమశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ వ్యాధి గ్రస్తులకు సికిల్‌సెల్‌ వ్యాధిపై అవగాహన కల్పించాలని కోరారు. గిరిజన గ్రామాల్లో 44 వేల మంది జనాభా నివసిస్తున్నారని, వారిలో 40 సంవత్సరాల లోపు జనాభా 22 వేలు ఉన్నారన్నారు. 17 వేల మందికి సెల్‌ టెస్టులు చేయగా ఇద్దరికి వ్యాధి ఉన్నట్టు తేలిందని చెప్పారు. 118 మందికి వ్యాధి వచ్చే అవకాశం ఉందని నిర్ధారణ అయినట్టు తెలిపారు. వారే కాకుండా ప్రస్తుతం జిల్లాలో 160 మంది వ్యాధిగ్రస్తులు చికిత్స పొందుతున్నారని, వారికి అందిస్తున్న వైద్యంపై వారం రోజుల్లో పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వ్యాధి వచ్చే అవకాశం ఉన్న 118 మందితో సమావేశం నిర్వహించి వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.పద్మలీల, డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ జీవనరాణి, డీఎల్‌ఓ డాక్టర్‌ రాణి, డీఈఓ మాణిక్యం నాయుడు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె.శ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అన్నపూర్ణ, ఎస్‌సీఎస్‌ ఇన్‌చార్జ్‌ పీడీ అరుద్ర, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అసోసియేట్‌ ప్రొఫెసర్లు డాక్టర్‌ శివకుమార్‌, డాక్టర్‌ అర్చన, డాక్టర్‌ వేణుగోపాల్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తు వల్లే ప్రమాదం

● ప్రమాదానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్‌



నిందితుడు వల్లంనాయుడి అరెస్టు చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాఘవులు, పక్కన సీఐ కె.నారాయణరావు

రామభద్రపురం: మండలంలోని జోగిందొరవలస లో ఈ నెల 21వ తేదీన వల్లం నాయుడు అనే వ్యక్తి మద్యం మత్తులో ట్రాక్టర్‌ నడిపి ప్రమాదానికి పాల్పడ్డాడని డీఎస్పీ ఎస్‌. రాఘవులు తెలిపారు. జోగింధొరవలసలో ట్రాక్టర్‌ ప్రమాదానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకుని అరెస్ట్‌ చూపారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రమాదానికి సంబంధించి వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. బొబ్బిలి మండలం మెరకమువలసకు చెందిన వంగపండు వల్లంనాయుడు, మోసూరు భాస్కరరావు, లక్ష్మణరావులు స్నేహితులు. అయితే వల్లంనాయుడు స్నేహితుల్లోకి ఫోన్‌చేసి మద్యం తాగుదాం రమ్మని ఆహ్వానించాడు. ముగ్గురులో ఇద్దరు ద్విచక్రవాహనంపై, ఒకరు బ్లేడ్‌ ట్రాక్టర్‌పై రామభద్రపురం మండలంలోని జోగిందొరవలస గిరిజన గ్రామానికి వెళ్లి అక్కడ మందు తాగారు. ఆ తర్వాత వల్లంనాయుడు మద్యం మత్తులో భాస్కరరావు బైక్‌ తాళం తీసుకున్నాడు. నా తాళం ఇవ్వు అని భాస్కరరావు ఎంతసేపు అడిగినా వల్లం నాయుడు ఇవ్వలేదు. దీంతో భాస్కరరావు ట్రాక్టర్‌ వెళ్లనివ్వనని చెప్పి బోయినెట్‌పై కూర్చున్నాడు. మద్యం మత్తులో ఉన్న వల్లం నాయుడు కూడా ట్రాక్టర్‌ ఎక్కి స్టార్ట్‌ చేసి ముందుకు లాగించేశాడు. ఆ రోడ్డు గోతులమయంగా ఉండడం వల్ల ప్రమాదవశాత్తు భాస్కర రావు కింద పడిపోవడంతో ట్రాక్టర్‌ చక్రాలు వెళ్లిపోగా వెనుక ఉన్న బ్లేడ్స్‌ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసునమోదు చేసిన సీఐ కె.నారాయణరావు, ఎస్సై వి.ప్రసాదరావు దర్యాప్తు చేశారు. ప్రమాదం జరుగుతుందని తెలిసి కూడా నిందితుడు అలా వ్యవహరించడం వల్ల ప్రమాదకేసుతో పాటు ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎస్సై అప్పారావు పాల్గొన్నారు.

ఎత్తుకు పై ఎత్తు వేస్తున్న ఆటగాళ్లు..!

● ఆసక్తికరంగా చెస్‌ పోటీలు



రెండవ రోజు జరిగిన పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

విజయనగరం: చెస్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ విజయనగరం జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 5వ జాతీయ స్థాయి దివ్యాంగుల జాతీయ చెస్‌ చాంపియన్‌ షిప్‌ పోటీలు రెండవ రోజు ఆసక్తికరంగా సాగాయి. జిల్లా కేంద్రంలోని మెసానిక్‌ టెంపుల్‌లో నిర్వహిస్తున్న రెండోరోజు పోటీలను చిన్న శ్రీను సోల్జర్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షులు మజ్జి సిరిసహస్ర శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో ఆత్మీయంగా మాట్లాడిన ఆమె పోటీల్లో విజేతలుగా నిలవాలంటూ ప్రోత్సహించారు. ఇదిలా ఉండగా దేశంలోని 16 రాష్ట్రాలకు చెందిన106 మంది క్రీడాకారులు జాతీయ చెస్‌ చాంపియన్‌ షిప్‌ పోటీల్లో తలపడుతుండగా..రెండవ రోజు ముగిసే సమయానికి 8 రౌండ్లు పూర్తయినట్లు చెస్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ విజయనగరం జిల్లా కార్యదర్శి కేవీ జ్వాలాముఖి తెలిపారు. శనివారం 9వ రౌండ్‌ ముగిసిన అనంతరం విజేతలను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ కేటగిరీల్లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్న క్రీడాకారులను త్వరలో జరగనున్న అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నామన్నారు. కార్యక్రమంలో చెస్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ విజయనగరం ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శులకు మెమోలు జారీ

విజయనగరం: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏడుగురు సచివాలయ కార్యదర్శులకు విజయనగరం కార్పొరేషన్‌ కమిషనర్‌ పల్లి నల్లనయ్య మెమోలు జారీ చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన నగరంలోని పలుప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనితీరును గమనించారు. ప్రజారోగ్య సిబ్బంది నిర్దేశిత సమయానికి విధులకు హాజరవుతున్నారా? లేదా? అని గమనించారు. అలాగే కాలువల పరిశుభ్రత, రహదారుల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం 24 వ నంబర్‌ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డుల నిర్వహణలో ఏడుగురు కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు గుర్తించి వారందరికీ మెమోలు జారీచేశారు. ఇటువంటివి సంభవించకుండా పునరావృతమైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని మందలించారు. విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

వేపాడ: విశాఖ జిల్లా పద్మనాభం మండలం కోడిగుడ్ల పంట గ్రామానికి చెందిన, ప్రస్తుతం పెందుర్తిలో నివాసముంటున్న ముమ్ములూరి సుగుణ(33) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్టు వల్లంపూడి పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుగుణ కుమార్తె రజ్యలు కావడంతో దేవరాపల్లి పరిసర ప్రాంతాల్లోని బంధువులకు చెప్పడానికి ఈ నెల 25న భర్తతోకలిసి బైక్‌పై వెళ్లి తిరిగి పెందుర్తి వస్తుండగా వేపాడ మండలం సంజీవ మెట్ట సమీపంలో ఆనందపురం నుంచి దేవరాపల్లి వెళ్తున్న మరో ద్విచక్రవాహనం డీ కొట్టింది. దీంతో రోడ్డుపై పడిపోయిన సుగుణ తలకు బలమైన గాయమైంది. వెంటనే విశాఖలోని కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ 26న రాత్రి చనిపోయిందని. దీనిపై మృతురాలి భర్త గుల్లిపల్లి మహేష్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

స్త్రీనిధి జిల్లా టార్గెట్‌ రూ.86 కోట్లు



మాట్లాడుతున్న స్త్రీనిధి జిల్లా ఏజీఎం కామరాజు

సీతానగరం: జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవనోపాధికి వివిధరకాల వృత్తులపై శిక్షణ ఇవ్వడంతోపాటు బ్యాంకుల ద్వారా రుణసదుపాయం కల్పించనున్నట్టు వెలుగు స్త్రీనిధి జిల్లా ఏజీఎం వి.కామరాజు అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలోని మండల వెలుగు సమాఖ్య కార్యాలయంలో వెలుగు ఏపీఎం రెడ్డి శ్రీరాములు అధ్యక్షతన సిబ్బందితో స్త్రీ నిధి రుణసదుపాయంపై ఆయన శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజీఎం కామరాజు మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి జిల్లా టార్గెట్‌ రూ.86 కోట్లుండగా ఇప్పటి వరకూ రూ.9 కోట్ల 20లక్షల రూపాయలు సంఘాల సభ్యులకు ఇచ్చినట్టు చెప్పారు. మండలసమాఖ్య పర్యవేక్షణలో అర్హులైన వారందరికీ జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా స్త్రీ నిధి రుణాలు బ్యాంకుల ద్వారా సమకూర్చనున్నామన్నారు. అలాగే సీతానగరం మండలం టార్గెట్‌ రూ.8 కోట్లు ఉండగా ఇప్పటివరకూ రూ.90 లక్షల రుణ సదుపాయం కల్పించినట్టు చెప్పారు. వృత్తి పనిలో శిక్షణ పొందిన వారంతా ఆర్థికంగా లబ్ధిపొందడానికి వివిధ రకాల వ్యాపారాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య సభ్యులు సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

వాచ్‌మన్‌ హత్య కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాఘవులు

బొబ్బిలి: పట్టణంలోని గ్రోత్‌సెంటర్‌లో గల రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న కనిమెరక వెంకట రమణ హత్య కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్‌ చేసినట్టు బొబ్బిలి డీఎస్పీ ఎస్‌ రాఘవులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాఘవులు నిందితుడి అరెస్టు చూపించి వివరాలు వెల్లడించారు. హతుడు వెంకటరమణ కుమార్తెతో వివాహేతర సంబంధం పెట్టుకున్న పాత బొబ్బిలిలోని రెడిసాపులో పనిచేస్తున్న కోట సర్వేశ్వర రావు ఈ కేసులో నిందితుడని స్పష్టం చేశారు. వాచ్‌మన్‌ కనిమెరక వెంకటరమణ విధుల్లో ఉండగా ఈనెల 20న రాత్రి గుర్తు తెలియని దుండగులు దాడి చేయడంతో బొబ్బిలి ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రానికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మరణించాడు. భర్తతో గొడవలున్న తన కుమార్తెతో వివాహేతర సంబంధం పెట్టుకున్న సర్వేశ్వర రావును వెంకటరమణ గట్టిగా హెచ్చరించాడు. దీంతో కక్ష పెంచుకున్న సర్వేశ్వరరావు గ్రోత్‌ సెంటర్‌కు వెళ్లి వెంకటరమణపై దాడి చేశాడు. సీసీ టీవీ ఫుటేజ్‌, కాల్‌డేటా, సంఘటన స్థలం వద్ద దొరికిన పర్స్‌ ఆధారంగా విచారణ జరిపి నిందితుడ్ని ప్రశ్నించడంతో నేరం అంగీకరించాడని డీఎస్పీ తెలిపారు. నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసును త్వరగా ఛేదించడంలో ప్రతిభ కనబర్చిన సీఐ కె.సతీష్‌కుమార్‌, ఎస్సై రమేష్‌, సిబ్బందిని డీఎస్పీ రాఘవులు అభినందించారు.

అందుబాటులోకి ఎంఆర్‌ఐ స్కాన్‌

విజయనగరం ఫోర్ట్‌:

సాక్షి ఎఫెక్ట్‌

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఎంఆర్‌ఐ స్కాన్‌ పనిచేయక పోవడం వల్ల రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఈ అంశంపై సాక్షిలో ఈనెల 25వతేదీన నిర్వహణ ఆస్పత్రిలో పనిచేయని ఎంఆర్‌ఐ శీర్షికన ప్రచురించిన కథనానికి ఆస్పత్రి అధికారులు స్పందించారు. ఈ మేరకు ఎంఆర్‌ఐ స్కాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.



రోగికి ఎంఆర్‌ఐ స్కాన్‌ తీస్తున్న దృశ్యం

మద్దువలస ప్రాజెక్టుసమీపంలో ఏనుగుల గుంపు

వంగర: మండల పరిధి మద్దువలస ప్రాజెక్టు సమీపంలో ఏనుగుల గుంపు శుక్రవారం సంచరించింది. మూడురోజుల క్రితం మండలంలోని కొత్త మడువలస గ్రామ సమీపంలోకి తిష్టవేసిన ఏనుగుల గుంపు సీతారాంపురం, గంగాడ, నారాయణపురం, సీలయ్యవలస, జగన్నాధవలస గ్రామాల మీదుగా మద్దువలస ప్రాజెక్టు సమీపానికి చేరుకుని తిష్ట వేశాయి. అనంతరం పటువర్థనం గ్రామ సమీపంలో ఉన్న వెలుగు చెరువు వైపు ఏనుగుల గుంపు పయనమైంది. దీంతో పరిసర గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అటవీశాఖ సిబ్బందితో పాటు సెక్షన్‌ ఆఫీసర్‌ కృష్ణ, వీఆర్‌ఏ శ్రీరాములు, పోలీస్‌సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



ప్రాజెక్టు సమీపంలో ఉన్న ఏనుగులు

అక్కరకు రాని ఈఎస్‌ఐ

● ఎక్స్‌రేకు దిక్కులేదు
● అరకొరగా రక్తపరీక్షలు
● శిథిలావస్థలో భవనాలు
● జరగని ఎల్‌ఎఫ్‌టీ పరీక్షలు



ఈఎస్‌ఐ డయాగ్నొస్టిక్‌ సెంటర్‌



పెచ్చులూడుతున్న భవనం



రేడియోగ్రాఫర్‌ లేక పోవడంతో మూసి ఉన్న ఎక్స్‌రే విభాగం గది

విజయనగరం ఫోర్ట్‌: కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తాం. ఈఎస్‌ఐ డిస్పెన్సరీ, డయాగ్నొస్టిక్‌ సెంటర్లలో సౌకర్యాలు కల్పిస్తాం అంటూ కూటమి ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. కానీ ఆ గొప్ప మాటలు అమలుకు నోచుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంక్షేమం మాట దేవుడెరుగు, కార్మికులకు కనీస సౌకర్యాలు కూడా అందని పరిస్థితి ఉంది. దీంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. కార్మికులకు ఏదైనా జబ్బు చేసినా, ప్రమాదం జరిగినా చికిత్స కోసం వచ్చే ఈఎస్‌ఐ డయాగ్నొస్టిక్‌ సెంటర్‌లో సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారు. పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

ఎక్స్‌రేకు రేడియోగ్రాఫర్‌ కరువు

ఈఎస్‌ఐ డయాగ్నొస్టిక్‌ సెంటర్‌లో ఎక్స్‌రేకు దిక్కు లేకుండా పోయింది. సెంటర్‌కు ఎక్కువగా ఎముకల సంబంధిత వ్యాధులతో కార్మికులు వస్తారు. ఆర్థోపెడిక్‌ వైద్యులు పరీక్షించి ఎక్స్‌రే, జరిగినా గాయాలతో వస్తారు. వారికి వ్యాధి నిర్ధారణ కోసం ఎక్స్‌రే తీయాల్సి ఉంటుంది. అయితే డయాగ్నొస్టిక్‌ సెంటర్‌లో ఎక్స్‌రే మిషన్‌ ఉన్నప్పటికీ తీసే నాథుడు లేకపోవడం వల్ల కార్మికులు ప్రైవేట్‌ ల్యాబొరేటరీలకు వెళ్తున్నారు. రూ. 300 నుంచి రూ. 350 వరకు వెచ్చించాల్సి వస్తోంది. అదేవిధంగా అల్ట్రాసౌండ్‌ స్కాన్‌ ఉన్నప్పటికీ రేడియాలజిస్టు లేకపోవడంతో గైనకాలజిస్టులు అల్ట్రాసౌండ్‌ స్కాన్‌ చేస్తున్నారు.

సెంటర్‌లో ఓపీ విభాగాలు

ఈఎస్‌ఐ డయాగ్నొస్టిక్‌ సెంటర్‌లో జనరల్‌ మెడిసిన్‌, జనరల్‌ సర్జరీ, ఎముకల విభాగం, అప్తమాలజీ, గైనిక్‌, ఈఎన్‌టీ, పీడియాట్రిక్‌ ఓపీ విభాగాలు ఉన్నాయి. ఆయా ఓపీ విభాగాల్లో సేవలు పొందేందుకు కార్మిక కుటుంబసభ్యులు ప్రతి రోజు 50 నుంచి 60 మంది వరకు వస్తారు.

జాడే లేని ఎల్‌ఎఫ్‌టీ పరీక్ష

డయాగ్నొస్టిక్‌ సెంటర్‌లో ఎల్‌ఎఫ్‌టీ (లిఫిడ్‌ ప్రొఫైల్‌ టెస్ట్‌) జరగడం లేదు. దీంతో కార్మికులు ఈ టెస్టు కోసం ప్రైవేట్‌ ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు.300 నుంచి రూ.400 వరకు ఖర్చు చేస్తున్నారు.

సెంటర్‌ పరిధిలో 21 వేల మంది కార్మికులు

ఈఎస్‌ఐ డయాగ్నొస్టిక్‌ సెంటర్‌ పరిధిలో 21 వేల మంది కార్మికులు ఉన్నారు. వారంతా ఏదైనా జబ్బు చేస్తే చికిత్స కోసం వస్తారు. ఓపీ సేవలు అవసరమైన వారికి ఇక్కడ చికిత్స అందిస్తారు. ఇన్‌పేషెంట్‌ సేవలు అవసరమైనా వారికి విశాఖలోని మల్కాపురంలో ఉన్న ఈఎస్‌ఐ ఆస్పత్రికి రిఫర్‌ చేస్తారు.

శిథిలావస్థకు చేరిన భవనాలు

ఈఎస్‌ఐ డయాగ్నొస్టిక్‌ సెంటర్‌ భవనాలు శిథిలావస్థకు చేరాయి. భవనాల్లోని పెచ్చులు ఊడిపోవడం తో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని కార్మికులు, సెంటర్‌ వైద్య సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. గాజులరేగ వద్ద నిర్మాణంలో ఉన్న ఈఎస్‌ఐ 100 పడకల ఆస్పత్రి నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా ఇంకా పూర్తి కాలేదు.

రేడియోగ్రాఫర్‌ లేరు

ఎక్స్‌రేలు తీసే రేడియోగ్రాఫర్‌ వేరే ఉద్యోగం వచ్చి వెళ్లిపోయారు. దీంతో ఎక్స్‌రేలు తీయడం లేదు. రేడియోగ్రాఫర్‌ను నియమించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. సెంటర్‌కు ప్రైవేట్‌ భవనంలోకి మార్చాలని ప్రతిపాదన ఉంది. త్వరలో మార్చే అవకాశం ఉంది.

డాక్టర్‌ కల్యాణ్‌ చక్రవర్తి, సూపరింటెండెంట్‌, ఈఎస్‌ఐ డయాగ్నొస్టిక్‌ సెంటర్‌

రసాభాసగా టీడీపీ గ్రామ కమిటీల ఎన్నిక సమావేశం



టీడీపీ డెంకాడ మండల కార్యాలయంలో కేకలు వేసుకుంటూ తోసుకుంటున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

● డెంకాడలో వర్గపోరు
● సమావేశం సాక్షిగా కేకలు వేసుకుంటూ, ఒకరినొకరు తోసుకున్న నాయకులు, కార్యకర్తలు
● నిలిచిన గ్రామ కమిటీల ఎన్నిక ప్రక్రియ

డెంకాడ: విజయనగరం జిల్లా డెంకాడ మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన టీడీపీ సమావేశం, గ్రామ కమిటీ ఎన్నిక రసాభాసగా సాగింది. పార్టీ గ్రామ ఎన్నిక కమిటీ పరిశీలకుడు, విజయనగరానికి చెందిన కనకల మురళీమోహన్‌ సమక్షంలోనే పార్టీ నాయకులు, కార్యకర్తలు బాహాబాహీకి దిగారు. ఒకరిపై ఒకరు కేకలు వేసుకుంటూ, తోసుకుంటూ గందరగోళాన్ని సృష్టించారు. ఎన్నికల పరిశీలకుడితో పాటు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ కర్రోతు బంగార్రాజు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పతివాడ అప్పలనారాయణ, పార్టీ మండల వాడ్యక్షుడు పల్లె భాస్కరరావు గ్రామాల వారీగా నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్నారు. ఆ సమయంలో పల్లెల్లోని పార్టీ శ్రేణుల్లో విభేదాలు ఒక్కసారి పొడచూపాయి. ఒకరిపై ఒకరు దూషణకు దిగారు. ఎన్నిక ప్రక్రియ రద్దుగా మారడంతో కొన్ని గ్రామ కమిటీ ఎన్నిక ప్రక్రియను నిలిపివేశారు. వాస్తవంగా చాలా రోజులుగా నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులు వర్గాలుగా చీలిపోయాయి.

ఓ వర్గం జనసేనకు చెందిన ప్రస్తుత ఎమ్మెల్యే నాగమాధవికి మద్దతు ఇవ్వడంతో మరోవర్గం గుర్రుగా ఉంది. ఎమ్మెల్యేతో తిరిగిన వర్గానికి చెందిన వారికే పనులు జరుగుతుండడం, మిగిలిన వారి పనులు పెండింగ్‌లో ఉండిపోవడంతో తరహా అంజాదీ రేగుతోంది. దీని ప్రభావం ఇప్పుడు గ్రామకమిటీల ఎన్నికల్లో పడింది. పల్లెల్లోనూ పార్టీ శ్రేణులు రెండు వర్గాలుగా విడిపోవడమే ఈ అలజడికి ప్రధాన కారణమని పార్టీ నాయకులు కొందరు బహిరంగంగా చెబుతున్నారు.